జలం.. గరళం


అపరిశుభ్రంగా ఉన్న 20 లీటర్ల వాటర్ క్యాన్లు

- జోరుగా మినరల్ వాటర్ దందా
- పుట్టగొడుగుల్లా అను'మతి'లేని వాటర్ ప్లాంట్లు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం

చీరాల టౌన్: ప్రస్తుతం చీరాల నియోజకవర్గంలో మంచినీటి వ్యాపారం ముసుగులో దందా కొనసాగుతోంది. మినిరల్ వాటర్ పేరుతో చిన్న గ్రామాల నుంచి పెద్ద పట్టణాల వరకు అంతా ఆ నీరే సేవిస్తూ రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు బాగా ముదరడంతో దాహార్తి తీర్చుకొనేందుకు వ్యాపారులు ఏ నీటిని పోస్తే వాటినే గుడ్డిగా తాగాల్సి వస్తోంది. ఇది అక్రమార్కులకు లాభసాటి వ్యాపారంగా మారింది. పెద్దగా పెట్టుబడి లేకుండా తక్కువ రోజుల్లోనే లక్షలు గడిస్తుండటంతో అంతా ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు.

అనుమతులు తూచ్

ఐఎస్ఐ అనుమతి ఏ ఒక్కరికి లేదు. ఇది కావాలంటే ప్రతియేటా లక్షకుపైగా ఖర్చవుతుంది. దీనికి తోడు ప్రతినెలా ప్రభుత్వ ల్యాబ్‌లలో టెస్ట్ చేయించాల్సి ఉంటుంది. వాటర్‌ప్లాంటులో ఆర్‌ఓ మిషనరీతో పాటు కెమిస్ట్‌తో పాటు మైక్రోబయాలజీ ఉండి నీటిని టెస్ట్ ఓకె అయిన తరువాత విక్రయించాల్సి ఉంటుంది. కానీ కొందరు అక్రమార్కులు రూపాయి ఖర్చుతో పదిరూపాయలు సంపాదించాలని అత్యాశతో ఎటువంటి అనుమతి లేకుండానే అక్రమ వ్యాపారానికి తీరలేపారు.

చీరాల నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లోని చిల్లరకొట్టు, బడ్డీబంకుల్లో సైతం రూ.10 వాటర్ పేరుతో దర్జాగా నీళ్ళ వ్యాపారం చేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో కేవలం రూ.10 వాటర్ బాటిళ్ల విక్రయాలు రోజుకు లక్షల్లోనే జరుగుతున్నాయి. కొత్తపేటలో అధికంగా ఈ ప్లాంట్లు నడుస్తున్నాయి.

నేరుగా నీరు పట్టి విక్రయిస్తున్నారు

చీరాల నియోజకవర్గంలోఉన్న ఒకటి రెండు మినహా మిగతా చోట్ల ఎటువంటి ప్రాసెసింగ్ చేయకుండా నీటి వ్యాపారం చేస్తున్నారు. మంచినీటి బోర్లు వేసి వాటిని ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా నింపి అదే నీటిని క్యాన్‌లలో పట్టి విక్రయిస్తున్నారు. కంపెనీలు ఇచ్చి ఫ్రిజ్‌లలో నీటిని పోయడం వలన నీరు ఎలా ఉన్నా చల్లగా ఉండటంతో అరలీటరు రూపాయి చొప్పున కొనుగోలు చేసి తాగుతున్నారు. చీరాల నుంచే కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, బాపట్ల ప్రాంతాలకు వాటర్ క్యాన్లు, రూ.10 వాటర్‌బాటిళ్లు టాటాఏస్, ఆటోలు, ఇతర వాహనాల్లో సరఫరా చేస్తున్నారు. చీరాలలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లు రోజుకు రెండువేల క్యాన్లు, వాటర బాటిళ్లు వేలాది కేసులను విక్రయిస్తున్నారు.

అధికారులెక్కడున్నారో..

ఇంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. గ్రామ పంచాయితీ స్థాయిలో కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఆహార తనిఖీ విభాగం, మున్సిపల్ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. కొన్ని శాఖల అధికారులు మామూళ్లు తీసుకుంటూ అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


టాటా ఏస్ ఆటోల్లో అమ్మకానికి తీసుకెళ్తున్న 10 వాటర్ బాటిళ్ల కేసులు

క్యాన్ నీటని కేవలం రెండు రూపాయలు ఖర్చు అవుతుంది. వ్యాపారులు దీనిని 15 రూపాయల లెక్కన ఎటువంటి శుభ్రం లేకుండానే ఒక్కో క్యానుకు వసూళ్ళు చేస్తున్నారు. వాటర్ క్యాన్లు ఎక్కువ సేపు నిల్వ ఉంటే బ్యాక్టీరియా చేరుతుంది. లేకుంటే ఫంగస్ కూడా పడుతుంది. కానీ ఎటువంటి శుద్ధిచేయకుండానే క్యానులలో బోరు నీళ్ళను నింపుతున్నారు. నిజానికి వాటర్ క్యాన్‌ల మూతసైజు రెండు అంగుళాలు మాత్రమే ఉంటుంది. క్యాన్‌ల లోనికి చేయి పోనిచ్చి శుభ్రపరిచే అవకాశం ఉండదు. దీంతో శుభ్రం లేకుండానే మరలా నీటిని పట్టి విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి తీవ్ర అనర్థం

ఈ నీరు తాగితే హానికరమని వైద్యులంటున్నారు. బోరు ద్వారా వచ్చే నీటిని శుద్ధి చేయకుండా తాగితే పలు సమస్యలు వస్తాయని తెలిపారు. చీరాల ప్రాంతంలోని నీటిలో ఐరన్‌శాతం అధికంగా, పీహెచ్ శాతం తక్కువగా ఉంటుంది. వీటి ద్వారా వైరల్ జబ్బులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. శుభ్రం చేయని క్యాన్లలో బ్యాక్టీరియా చేరి పలు అనారోగ్య సమస్యలను తెచ్చే ప్రమాదం ఉంది. ఈ నీటిని తాగితే వైరల్ ఫీవర్లు, గొంతునొప్పి, డయేరియావంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది. క్లోరిన్ వేసి వాడుకోవాలి.

క్లుప్తంగా

ఉచిత విద్య సద్వినియోగం చేసుకోండి


విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

అద్దంకి: ఉచిత విద్యా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఈవో గంగాధర్ అన్నారు. మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు మంగళవారం సమగ్ర శిక్ష అభియాన్ ఇంటర్ షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా పదో తరగతి పూర్తి అయిన 29 మంది విద్యార్థులకు అద్దంకి పట్టణంలోని పలు ఇంటర్నెట్ కేంద్రాల్లో.. మీసేవ కేంద్రాల్లో సచివాలయాలను సందర్శించి మెళకువలు నేర్పించారు. ఎలమంద, అలీ, ఎస్. శివరామకృష్ణ, డిప్యూటీ ఈఓ గంగాధర్ పాల్గొన్నారు.

అర్జీల విచారణ సత్వరం చేయండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, పీజీఆర్ఎస్ అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పని చేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లేఅవుట్లు వేయకుండా కట్టడి చేయడంతో పాటు నీటి తీరువా వసూళ్ల చేయాలన్నారు. ఓటీసీలపై పలు సూచనలు అందించారు. రెవెన్యూ ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆర్‌ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్‌ల అందజేత


విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ విశ్వరాణి

పర్చూరు(చినగంజాం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏడాది కాలం పాటు వివిధ రకాల వృత్తులలో శిక్షణ పూర్తి చేసుకున్న 7 గురు విద్యార్థులకు ప్రిన్సిపాల్ విశ్వరాణి సర్టిఫికెట్‌లు అందజేశారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె సర్టిఫికెట్‌లను విద్యార్థులకు అందించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. జిల్లా ఒకేషనల్ కో ఆర్డినేటర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సౌజన్య, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు


పర్చూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మోహనరావు


మాట్లాడుతున్న బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి వాణిశ్రీ

చీరాల రూరల్: రసాయన వ్యవసాయ పద్ధతులను రైతులు విడనాడి ప్రకృతి వ్యవసాయంలోకి మారాలని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి వీరగాని వాణిశ్రీ అన్నారు. చీరాల మండల సమాఖ్య కార్యాలయం, బుర్లవారిపాలెంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్) ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారీ గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి వాణిశ్రీ మాట్లాడారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో పీఎండీఎస్ చేయిస్తారని నాన్ పంచాయతీల్లో బీఏలు, వీఏఏలు రైతులతో కలిసి పీఎండీఎస్ చేయించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం నవసార్వత్రిక సూత్రాలైన 365 రోజులు భూమిని పంటలతో కప్పి ఉంచడం, పంట అవశేషాలతో భూమిని కప్పి ఉంచడం, రైతులు సొంత విత్తనాలు దేశవాళి విత్తనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి సుమతి మాట్లాడుతూ ప్రకృతి వ్యసాయ ఉత్పత్తులు ఎంతో ఆరోగ్యంగా ఉంటాయని సూచించారు. మండల ఏపీఎం మధుసూదన్ మాట్లాడుతూ మన పూర్వీకులు రసాయన మందులు ఉపయోగించుకుండా ఆహార పంటలు పండించి మంచి ఆరోగ్యవంతులుగా జీవించారని చెప్పారు. చీరాల డివిజన్ మాస్టర్ ట్రైనర్ భారతి మాట్లాడుతు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారు చేయడంలో రైతులతో పీఎండీఎస్ చేయడంలో మహిళా సంఘాలు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సదస్సు అనంతరం అభ్యుదయ రైతులు లేళ్ల వెంకటరమణారావు, గవిని సాల్మన్‌రాజును సత్కరించారు. సదస్సులో సీసీలు శ్రీనివాసరావు, కవిత, బుజ్జి, శ్రీవల్లి, జ్యోతి, వీఏఏలు, విహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): ప్రకృతి వ్యవసాయంతో పంటల సాగు చేసి ఖర్చులు తగ్గించాలని పర్చూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్. మోహనరావు అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహించారు. ఆదర్శ రైతులు వెంకటేశ్వర్లు, దావూల్ సాహెబ్‌లను సన్మానించారు. వ్యవసాయాధికారి రామ్మోహనరెడ్డి, మల్లేశ్వరి, వెలుగు ఏపీఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కొడవలివారిపాలెం (కారంచేడు): గర్భిణులను తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో పాటు అవసరమైన పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు. మంగళవారం మండలంలోని కొడవలివారిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోస్ట్ పక్వాడా చివరి రోజు కార్యక్రమంలో ఆమె తల్లులకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన పౌష్టికాహారం కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. గర్భస్థ దశ నుంచి బిడ్డకు రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, ఇంటి పరిసరాల పరిశుభ్రత కూడా ప్రజలకు ఎంతో అవసరమని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించే పౌష్టికాహారం ఎలా సరఫరా అవుతుందో పరిశీలించారు. ఆకుకూరలు, పండ్లు, పాలు, మాంసాహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఐరన్ తక్కువగా ఉన్న గర్భిణులను గుర్తించి ప్రభుత్వ వైద్యుల సూచనల మేరకు వారికి అవసరమైన ఐరన్ మాత్రలు, సిరప్‌లు కూడా అందించే ఏర్పాట్లు చేశామన్నారు. స్వర్ణ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత, గ్రామంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.


కొడవలివారిపాలెంలో ఆరోగ్య నియమాలను వివరిస్తున్న ఇంకొల్లు సీడీపీఓ ఝాన్సీ

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అధికారులు పూర్తి స్థాయిలో శ్రద్ధ తీసుకోవాలని లేకుంటే వాటిని మూసి వేయాల్సిన పరిస్థితి ఉందని కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చినగంజాం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖల పరిధిలోని అభివృద్ధి పనులు, నిర్వహిస్తున్న పనులు గురించి మాట్లాడారు. పలు అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు మాట్లాడుతున్న సమయంలో ఆసోది బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం 50 శాతం తగ్గిపోయిందని, ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ క్యాంపెయిన్ తాను హాజరైన సందర్భంలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను చేర్చేందుకు తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారని, గతంలో తాము చదువుకునే సమయంలో లేని ఎన్నో మంచి వనరులను ప్రస్తుత ప్రభుత్వాలు కల్పిస్తున్నప్పటికీ పాఠశాలలు బలోపేతం కాలేక పోతున్నాయని తెలిపారు. అందుకు కారణం పాఠశాలల్లో వసతులు గురించి అధికారులు తల్లిదండ్రులు తెలియచేయక పోవడమేనన్నారు. అదే విధంగా తల్లికి వందనం పేరుతో ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేయాల్సిన నగదు సకాలంలో అందించక పోవడమే కారణమని ఆరోపించారు. ఎంపీడీఓ ఎ. శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నైపుణ్యాలు గుర్తించాలి

నందిగుంటపాలెం (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసేలా ప్రత్యేక కృషి చేస్తున్నామని నందిగుంటపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత అన్నారు. మంగళవారం ఆమె గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి అయిన కుమ్మరి రాజేష్ ద్వారా పాఠశాలలో మంచి ప్రతిభను కనబర్చిన ఐదో తరగతి పూర్తి అయిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు దాతల సహకారంతో రూ. 5000 నగదును పంపిణీ చేశారు. రాబోవు రోజుల్లో మరింత ప్రోత్సాహక బహుమతులు సైతం అందిస్తామని పేర్కొన్నారు. ఎస్. నరసింహారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ఎన్. రాంబాబు పాల్గొన్నారు.


నందిగుంటపాలెంలో నగదు బహుమతులు అందిస్తున్న దాతలు రాజేష్, ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు ప్రారంభం

దగ్గుబాడు (కారంచేడు): ఈ సంవత్సరాలకు గాను మంగళవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించిన అడ్మిషన్లు జరుగుతున్నాయని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. వారికి ప్రభుత్వం నుంచి అందించే అన్ని రకాల లబ్ధి చేకూరుతుందన్నారు. పుస్తకాలు, బ్యాగ్‌లు, బట్టలు, బూట్లు వంటివి కూడా అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి కూడా విద్యార్థులను చేర్పించుకుంటున్నామన్నారు. మండలంలోని దగ్గుబాడు అంగన్‌వాడీ కేంద్రం నుంచి ముగ్గురు విద్యార్థులను కూడా మెయిన్ ప్రాథమిక పాఠశాలలో జాయిన్ అయ్యారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భవనం శ్రీనివాస రెడ్డి, సీహెచ్ మహాలక్ష్మమ్మ, మాధురి పాల్గొన్నారు.


దగ్గుబాడులో మెయిన్ ప్రాథమిక పాఠశాలలో జాయిన్ అవుతున్న అంగన్‌వాడీ చిన్నారులు

భూమిని కాపాడుకోవాలి


వేటపాలెం: ప్రతిభా పోటీల్లో విజేత విద్యార్థులతో ఉపాధ్యాయలు



వ్యాసరచన పోటీలో బహుమతులు అందుకున్న విజేతలు

చీరాల అర్బన్: భూమిని కాపాడుకునే ఉమ్మడి బాధ్యత అందరిపై ఉందని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఒంగోలు వారి సహకారంతో ప్రొటెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో చీరాలలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జీవం ఉన్న ఏకైక గ్రహం భూమి అని మానవుడు అవసరాలను తీర్చడానికి సహజ వనరులున్నాయన్నారు. అవసరానికి మించి వాడకం వలన అన్ని అనర్థాలేనని పేర్కొన్నారు. వనరులు పొదుపుగా వాడుకోవడమే కాకుండా పర్యావరణ హిత జీవనశైలితో అందరూ భూమిని కాపాడుకోవాల్సి ఉందన్నారు. రకరకాల కాలుష్యాలు పెరిగిపోవడం వలన క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు మరింత ప్రబలుతున్నాయని, భావితరాల వారు మరిన్ని సమస్యలను ఎదుర్కొనవలసి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శవనం చంద్రారెడ్డి, పాఠశాల ఇన్‌ఛార్జి గోవర్థనమ్మ, శారద, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ధరిత్రి దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ఎం శేఖరరావు మాట్లాడుతూ భూగోలం కాలుష్య కోరల్లోచిక్కకుండా, మన కోసమే కాకుండా, భవిష్యత్తు తరాల కోసం కూడా అందించాలన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బుద్ధి మోహన్‌రావు, ఎస్. లలితాపరమేశ్వరి, ఉమ్మిటి వేణుగోపాలరావు, సీహెచ్ భవానీ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై సైనిక చర్యలు నిలిపివేయాలి

వేటపాలెం: ఆపరేషన్ కంగార్ పేరుతో ఆదివాసీలపై జరుగతున్న సైనిక చర్యలను వెంటనే నిలిపివేయాలని యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేగిరి సంజీవరావు డిమాండ్ చేశారు. రామన్నపేట వినాయకపురంలో యానాది సంఘాల కూటమి నాయకులు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంగళవారం మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ చతీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిస్సా, మహారాష్ట్రలో ఉన్న సహజ వనరులైన ఖనిజ సంపదను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బహుళ జాతి కంపెనీలతో ఇతర దేశాలకు తరలిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని వ్యతిరేకిస్తున్న గిరిజనులపై మావోయిస్టులనే ముద్ర వేసి ఆపరేషన్ కంగార్ అనే పేరుతో మారణ కాండ సృష్టించడం ఎంతో బాధాకరమన్నారు. సహజ ఖనిజ సంపద మన దేశానికి మాత్రమే ఉపయోగపడాలి కానీ ఇతర దేశాలకి తరలించడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీలతో శాంతియుత చర్యలు జరిపి నిజమైన గిరిజనులకి న్యాయం చేసి భవిష్యత్ తరాలకి సహజమైన ఖనిజ సంపద ఉపయోగపడేలా చేయాలని కోరారు. ఆయా రాష్ట్రాల్లో ఆదివాసీలు పోరాటం చేస్తున్న వారికి యానాది సంఘాల మహాకూటి మద్దతు ఇస్తుందన్నారు. రాష్ట్ర యూత్ ఆర్గనైజర్ గందళ్ల నరేష్, వేటగిరి ఆదెమ్మ, చౌటూరి లక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యానాది సంఘం నాయకులు

26న వీరాంజనేయ స్వామి తిరునాళ్లు

బల్లికురవ: మండలంలోని పెద అంబడిపూడి గ్రామ సమీపంలోని చింతతోపులో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి 42వ వార్షిక తిరునాళ్ల శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు మంగళవారం తెలిపారు. అర్చకులు పవన్‌కుమార్ శర్మచే ఉదయం 5 గంటల నుంచే స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, తమలపాకులతో అర్చన ప్రత్యేక అలంకరణ, అన్న సంతర్పణ.. సాయంత్రం కోలాట ప్రదర్శన, భారీ ఎలక్ట్రిక్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వాటర్ కూలర్ వితరణ

పర్చూరు(చినగంజాం): స్థానిక ఏఎస్ అండ్ వీఎస్ బాలికోన్నత పాఠశాలకు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ మంగళవారం తన కుమారుడు తరుణ్ పుట్టినరోజు పురస్కరించుకొని వాటర్ కూలర్ అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోమటి ఆంజనేయులు, నాగభైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, హెచ్ఎం అవని, పూర్వపు హెచ్ఎం పార్వతి పాల్గొన్నారు.


పాఠశాలకు వాటర్ కూలర్ అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్లు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పోలేరమ్మ అమ్మవారు

- ఘనంగా శిడిమాను మహోత్సవం
- అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

చీరాల: స్థానిక పేరాల హరిప్రసాద్‌నగర్‌లో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారి 50వ వార్షికోత్సవ తిరునాళ్లు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన పేరాల పోలేరమ్మకు భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి విశేష పూజలను నిర్వహించారు. మహిళా భక్తులు జలబిందెలను ఎత్తుకొని డప్పువాయిద్యాలతో ఆలయ ప్రాంగణానికి చేరి తమ మొక్కులను తీర్చుకున్నారు. వివిధ రకాల విన్యాసాలతో బాకాలతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం శిడి పెళ్లి కొడుకును కనక తప్పెట్లు, యువకుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వచ్చి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుడి వద్ద ఉన్న శిడిమానుపై భాగంలో ఒక పెట్టెలో మేకపోతును ఉంచి గుడి చుట్టూ మూడు ప్రదక్షణలు చేసి ఆ మేకపోతును భక్తులు జీడి కాయలతో కొట్టి తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. తిరునాళ్ళు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐదు రోజులు పాటు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభను, 40 అడుగుల అమ్మవారి డిజిటల్ సెట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఎం.మోయిన్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, తదితర సామాగ్రి భక్తులను విశేషంగా ఆకర్షించాయి. భక్తులు పులిహోర, మజ్జిగ, మంచినీటి వసతులు కల్పించారు.

భీమవరంలో 250 మందికి వైద్య పరీక్షలు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని భీమవరం గ్రామంలో మంగళవారం ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని అన్నెం ఆంజనేయ స్వామి ఇంటి ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో మొత్తం 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు గుండె, కిడ్నీ రోగులకు జాగ్రత్తలు తెలియజేశారు. పరీక్షలు నిర్వహించిన వారికి వైద్య చికిత్స అందజేసి ఉచితంగా మందులు అందజేశారు. వారిలో 42 మందిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు రావాల్సిందిగా సిఫార్సు చేశారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, ఈసీహెచ్ఎస్, రైల్వేఎఫ్‌సీఐ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని ఆస్పత్రి ప్రతినిధి షేక్ రఫీ వివరించారు. ఈ డాక్టర్ రామాంజనేయులు, లత, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో విచారణ

మార్టూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనల నేపథ్యంలో మంగళవారం విచారణ నిర్వహించారు. ఈ నెలలో విధి నిర్వహణలో ఓపీ విభాగంలో ఉన్న పిల్లల వైద్యునిపై ఇదే ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఓ మహిళ బయట వ్యక్తులను రప్పించి విచక్షణారహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. దీనితోపాటు పిల్లల వైద్యుడు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న క్రమంలో ఆయన రెన్యువల్ విషయమై కూడా విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విచారణ అధికారులుగా వచ్చిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన సివిల్ సర్జన్ మరియు మెడికల్ సూపరింటెండెంట్ సి.అరుణ్ కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఫణి భూషణ్.. వైద్యులు సిబ్బందిని విచారించారు.

సెల్ టవర్ల బ్యాటరీ దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై కమలాకర్

ముండ్లమూరు (కురిచేడు): ఇటీవల కాలంలో సెల్ టవర్ల బ్యాటరీలు దొంగిలించిన దొంగల ముఠాను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. మంగళవారం పాత్రికేయుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని వేంపాడు జంక్షన్ వద్ద నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. జె.పంగులూరుకు చెందిన కారుమంచి ఖాసిం, ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన షేక్ జాన్‌వలి, షేక్ జియాలబ్దిన్, మార్టూరు మండలం ద్రోణాదులకు చెందిన కాటూరి జాలయ్యలను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు మండలంతో పాటు బాపట్ల జిల్లా చిన్నగంజాం, ఇంకొల్లు, పర్చూరు మండలాల్లోని పలు టవర్లకు చెందిన బ్యాటరీలను దొంగతనం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల నుంచి రూ.4.40 లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్సై కమలాకర్, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.